అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం : ఎస్‌పి

ప్రజాశక్తి -కమలాపురం టౌన్ : బహిరంగ ప్రదేశాల్లో గంజాయి, మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉక్కుపాదం మోపుతామని ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌లో వచ్చిన ప్రజలకు పోలీసులు అండగా నిలవాలని పేర్కొన్నారు. కమలాపురంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం లాంటి 12 ప్రాంతాలను గుర్తించి ఎనిమిది ప్రాంతాల్లో శుభ్రపరచారని మిగిలిన వాటిని కూడా శుభ్రపరిచేందుకు తమ సిబ్బంది ఉన్నారని తెలిపారు. ముఖ్యంగా జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలని పేర్కొన్నారు. కమలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇప్పటికే పలు గంజాయి, గ్యాంబ్లింగ్ లాంటి కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అసాంఘిక కార్యక్రమాలు జరిగినా సమాచారం తెలియజేయాలని తెలిపారు.

నేటి నుంచి 'ప్రయివేట్' మద్యం

కడపలో 139 , అన్నమయ్యలో 111 దుకాణాలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ప్రయివేటు మద్యం అందుబాటులోకి రానుంది. సోమవారం కడప జిల్లా పరిషత్ సమావేశ హాలులో 139, అన్నమయ్యలోని అజయ్ ఫంక్షన్ హాలులో 111 దుకాణాలకు కలెక్టర్ అధ్యక్షతన లక్కీడ్రా నిర్వహించిన సంగతి తెలిసిందే. లక్కీడ్రాలో పాల్గొన్న ప్రయివేటు వ్యాపారులు మద్యం దుకాణాలు దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఉభయ జిల్లాల్లో నిర్వహించిన లక్కీడ్రాలో దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు దుకాణాల ఏర్పాట్లపై దృష్టి సారించారు. కడప, అన్నమయ్య జిల్లాల్లో లక్కీడ్రా దక్కించుకున్న దరఖాస్తుదారులు చెల్లించిన రూ.2 లక్షలు, నాన్ రీఫండబుల్ దరఖాస్తు ఫీజు దగ్గర నుంచి రూ.55 లక్షలు, రూ.65 లక్షల చొప్పున లైసెన్స్ ఫీజులను మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మండలాల కేటగిరీలుగా చెల్లించిన సంగతి తెలిసిందే. ఈలెక్కన ప్రభుత్వానికి 1.48 కోట్లు ఆదాయం లభించింది. నాన్ రీఫండబుల్ కింద రూ.64.18 కోట్లు, రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ కింద రూ.84 కోట్లు ఆదాయం సమకూరినట్లు తెలుస్తోంది. మొదటి ఏడాదిలో ఆరు దఫాలుగా చెల్లి ంపుల్లో భాగంగా ఫస్ట్‌ఇన్‌స్టాల్మెంట్ కింద తాజాగా రూ.14 కోట్లు ఆదాయం లభిం చింది. ఈ నెల 16 నుంచి నూతన మద్యం పాలసీ అమలు చేయడంలో భాగంగా ఉభయ జిల్లాలోని ప్రయివేటు దుకా ణదారుల దుకాణాల నిర్వహణకు ఎక్సైజ్‌శాఖ క్లియరెన్స్ ఇచ్చిన అనంతరం సరుకును దుకాణాలకు తరలించనున్నట్లు తెలుస్తోంది. బుధవారం సరుకు ఇండెంట్స్ తీసుకున్నట్లు తెలుస్తోంది. సరుకు ఇండెంట్ల స్వీకరణ అనంతరం బుధవారం నుంచి ప్రయివేటు మద్యం దుకాణాలకు సరుకును తరలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఏనుగుల స్వైర విహారం

- దాడిలో రైతు దుర్మరణం
- మామిడి తోటలో తిష్ట వేసిన ఏనుగుల గుంపు
- భయాందోళనల్లో ప్రజలు, రైతులు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, అధికారులు

మామిడి తోటలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

ప్రజాశక్తి-పీలేరు

రైతు రాజారెడ్డి (ఫైల్ ఫొటో)

ఏనుగుల దాడిలో ఓ రైతు దుర్మ రణం చెందిన సంఘటన పీలేరు పట్టణ సమీ పంలో చోటుచేసుకుంది. పీలేరు పట్టణానికి అత్యంత సమీపంలోని ఇందిరమ్మ కాలనీకి దగ్గరగా చోటు చేసుకున్న సంఘటనా వివరాలు.. మండలంలోని కాకులారంపల్లి పంచాయతీ బందార్లపల్లికి చెందిన రైతు మోపిరెడ్డి రాజారెడ్డి (62) మంగళవారం ఉదయం తన ఆవులు తోలుకుని పొలం వద్దకు బయలుదేరి వెళ్లాడు. వర్షం కురు స్తుండడంతో తన వెంట తీసుకెళ్లిన గొడుగును తెరవడంతో సమీపంలోని పొదల్లో ఉన్న ఏనుగుల గుంపు రైతుపై దాడి చేశాయి. రైతు ప్రాణ భయంతో కేకల పెట్టడంతో అక్కడికి దగ్గరలోని పొలంలో ఇల్లు కట్టుకుని ఉన్న మరో రైతు చూసి, ఊరి ప్రజలకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పీలేరు తహశీల్దారు భీమేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, అటవీ శాఖ ఉద్యోగులు, సిబ్బంది, పీలేరు ఎస్ఐ బాలకృష్ణ, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రస్తుతం సుమారు 16 ఏనుగుల గుంపు ఘటనా స్థలానికి సమీపంలోని పీలేరు సింగల్ విండో మాజీ అధ్యక్షులు రెడ్డప్పరెడ్డి మామిడి తోటలో సంచరిస్తున్నాయి. స్థానికులతో పాటు సమీప గ్రామాల ప్రజలు, రైతులు భయాందోళనకు లోనయ్యారు. ఈ ఏనుగుల గుంపును అడవుల్లోకి ఎలా పంపాలన్న సందిగ్ధంలో స్థానిక అటవీ శాఖ అధికారులు ఆలోచనలో పడ్డారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, అధికారులు : ఏనుగుల దాడిలో రైతు రాజారెడ్డి మృతి చెందిన సమాచారం అందిన వెంటనే పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని అక్కడి పరిస్థితులను పరిశీలించారు. రైతు మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం అన్నమయ్య, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు, అటవీ శాఖ ఉన్నతాధికారులు, ఎస్‌పిలతో ఫోన్లో మాట్లాడి జరిగిన పరిస్థితిని వివరించి, తక్షణం సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. అటవీ శాఖ అధికారి జగన్నాథ్ సింగ్, చిత్తూరు జిల్లా అటవీ శాఖ అధికారి భరణి, తిరుపతి సిసిఎఫ్ సెల్వం, మదనపల్లి సబ్ డిఎఫ్ఒ శ్రీనివాసులు, పీలేరు తహశీల్దారు భీమేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, సిఐ, ఎస్ఐ, పోలీస్ సిబ్బంది, అటవీ శాఖ సిబ్బంది కూడా అక్కడికి చేరుకున్నారు.

రైతు కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేత : ఏనుగుల దాడిలో మృతి చెందిన రైతు చిన్న రాజారెడ్డి భార్య సరస్వతమ్మకు ప్రభుత్వం తరపున రూ.5 లక్షల పరిహారం చెక్కును డిఎఫ్ఒ జగన్నాథ్ సింగ్‌తో ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజారెడ్డి కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.10 లక్షల పరిహారం మంజూరైందని, తొలివిడతగా రూ.5 లక్షల చెక్కును అందజేశామని, త్వరలోనే మిగిలిన రూ.5 లక్షలను మృతుడి భార్య బ్యాంకు ఖాతాలో జమ చేస్తామన్నారు. జిల్లాల విభజన కారణంగా తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా సోలార్ ఫెన్సింగ్ ప్రాజెక్టు అర్థాంతరంగా ఆగిపోయిందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాను ప్రాతిపదికగా తీసుకుని, ఎమ్మెల్యేలందరినీ కలుపుకుని త్వరలో జరగబోయే టిడిఎల్‌పి సమావేశంలో చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళతామన్నారు. మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు యల్లెల రెడ్డప్పరెడ్డి మామిడి తోటకు అపార నష్టం వాటిల్లిందని, ఆయనకు పరిహారం లభించేలా చూడాలని ఎమ్మెల్యే డిఎఫ్ఒకు సూచించారు.

ఆరోగ్యానికి మొక్కలు పెంచుదాం

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఆరోగ్యానికి, ఆహ్లాదానికి, వాతావరణ సమతుల్యతకు మొక్కలు పెంచుదామని ఎల్ఐసి రీజనల్ మేనేజర్ సరస్వతి గోపకుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎల్ఐసి డివిజనల్ కార్యాలయ ఆవరణలో 'ప్లాంట్ ఎ లైఫ్' కార్యక్ర మంలో భాగంగా మంగళవారం ఒక మొక్కను నాటారు. వాతావరణ సమతుల్యత దెబ్బ తినడం వల్ల అకాల వర్షాలు, ఆకస్మిక వరదలు, విపరీతమైన ఉష్ణోగ్రతల్లో తేడాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. ఇవి ఉత్పాదక రంగాలను దెబ్బతీస్తున్నాయని చెప్పారు. నాగరికతకు చిహ్నమైన మొక్కలు పెంచడం, కాలుష్యాన్ని నివారించడం, గ్రీన్ ట్రిబ్యునల్ ప్రమాణాలకు అనుగుణంగా పనిచేయడం ద్వారానే మనం ప్రతికూల వాతావరణాన్ని అడ్డుకోవడం సాధ్యమన్నారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ మేనేజర్ రవికుమార్, మార్కెటింగ్ మేనేజర్ శ్యామసుందర్రావు, ఇతర మేనేజర్లు సత్య శ్రీనివాస్, సత్యప్రసాద్ సంఘాల నేతలు చంద్రపాల్, రఘునాథరెడ్డి, రామాంజనేయులు, రెడ్డి భాస్కర్, అధికారులు రమేష్ బాబు, హరీంద్ర పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి- కడప అర్బన్ : మానవ అక్రమ రవాణాపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కడప మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి, మహిళ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శాంతా సూచించారు. మంగళవారం కడప నగరంలోని నగరపాలక ఉర్దూ బాలికల ఉన్నత పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాబితా ఖానం ఆధ్వర్యంలో విద్యార్థులకు మానవ అక్రమ రవాణా కార్యక్రమం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎస్‌పి ఆదేశాల మేరకు, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి సూచనల మేరకు మానవ అక్రమ రవాణాపై బలిక విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలను విరివిగా నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా అక్రమ రవాణాలో ఆర్గాన్స్, హ్యూమన్, చైల్డ్ అండ్ ఉమెన్, సెక్సువల్ బలవుతున్నారని గుర్తు చేశారు. ఎంఇఒ గంగిరెడ్డి మాట్లాడుతూ బాలికలు పాఠశాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో ఏదైనా ఇబ్బందికర విషయాలు ఉన్నట్లయితే వెంటనే పాఠశాల ఉపాధ్యాయులకు, తర్వాత తల్లిదండ్రులకు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సహదేవరెడ్డి, నగరపాలక పాఠశాలల సూపర్‌వైజర్ ఫరూక్ అహ్మద్, పాఠశాల ఉపాధ్యాయులు, కడప మండలం వనరుల కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' నిధులతో సిమెంట్ రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని కొలుములపల్లి రసూల్ పల్లి గ్రామపంచాయతీల్లో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సిసి రోడ్డు నిర్మాణానికి అధికారులు, కూటమి పార్టీ నాయకులు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎం. కులాయి బాబు మాటాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డి సహకారంతో ఉపాధి హామీ పథకం నిధులు ఉపయోగించి సిసి రోడ్లు నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వెంకటసుబ్బారెడ్డి, ఉపాధి ఎపిఒ రామాంజున్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మహేందర్ రెడ్డి, పెట్రోల్ బంక్ రవిశంకర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి వెంకటసుబ్బయ్య, రసూల్ పల్లె సర్పంచి జి.స్వాతి, మాజీ సర్పంచ్ రాజా, గ్రామస్తులు పాల్గొన్నారు. **కమలాపురం టౌన్ :** మండలంలోని కోగటం పంచాయతీ చిన్నపురెడ్డి పల్లెలో పల్లె పండుగ - వారోత్సవాలులో భాగంగా ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి సిసి రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలాపురం మండలంలో కోగటంతోపాటు అన్ని పంచాయతీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కమలాపురం మండలం అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌యు రిజిస్ట్రార్‌గా బోయ విజయకుమార్ నాయుడు

ప్రజాశక్తి కడప అర్బన్ :యోగి వేమన యూనివర్సిటీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెటీరియల్స్ సైన్స్ అండ్ నానోటెక్నాలజీ సహ ఆచార్యులు డాక్టర్ బోయ విజయకుమార్ నాయుడు రాయలసీమ యూనివర్శిటీ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. ఈయన విశ్వవిద్యాలయంలో శాఖ అధిపతిగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, రాష్ట్రీయ ఉచ్చరత్ శిక్ష అభియాన్ సమన్వయకర్తగా, ట్రాన్స్‌పోర్టు విభాగ సమన్వయకర్తగా, వైవీయూ ప్రవేశాల సహాయ సంచా లకులుగా, న్యాక్ కోర్ కమిటీ సభ్యులుగాపనిచేశారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, యుజిసి రీసెర్చ్ ప్రాజెక్టులతో పరిశోధనలు చేశారు. యుజిసి పోస్ట్ డాక్టర్ రామన్ ఫెలోషిప్, డిఎస్‌టి యంగ్ సైంటిస్ట్ అవార్డు పొందారు. విజయ కుమార్ నాయుడును విసి కె.కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ రఘు నాథరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పి. పద్మ అధ్యాపకులు అభినందించారు.

రైతు సేవా కేంద్రంలో గ్రామసభ

ప్రజాశక్తి- గోపవరం : బద్వేల్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని గోపవరం మండలం రాచయిపేట, శోత్రియ రామాపురం రైతు సేవా కేంద్రంలో ఖరీఫ్ - 2024 సీజన్‌కు సంబంధించి ఇ పంట నమోదుపై సామాజిక తనిఖీ నిమిత్తం మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సభల్లో రైతుల సందేహాలు అధికారులుతీర్చారు. వారి ఫిర్యాదుల స్వీకరించారు. ఈ పంట నమోదులో పంట సాగు లేకున్నా, ఇతర వివరాలు తప్పుగా నమోదు చేసినా స్థానిక రైతు సేవా కేంద్రం లో ఫిర్యాదు చేయవచ్చని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు ఎం. నాగరాజు స్థానిక ల్యాబ్ వ్యవసాయ అధికారిని మాధురి, వ్యవసాయ విస్తరణ అధికారులు ఓబయ్య, విజయ్ కుమార్, నిఖిత, రైతులు పాల్గొన్నారు.

మద్యం టెండర్లలో కూటమి నేతల సిండికేట్ : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప : పార్టీ యువనేత వెన్నపూస మధు రెడ్డి ఆరోపించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రయివేటు దుకాణాలకు టెండర్లు నిర్వహించారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,396 మద్యం దుకాణాల కోసం దాదాపు 89 వేల దరఖాస్తులు వచ్చాయి అని తెలిపారు. ఈ టెండర్లలో కూటమి నేతలు సిండికేట్‌గా ఏర్పడి దాదాపు 90 శాతం వరకు మద్యం దుకాణాలను దక్కించుకున్నారు అన్నారు. మిగిలిన 10 శాతం మద్యం దుకాణాలు వచ్చినవాళ్ళని కూడా కమీషన్ కోసం రాజకీయ ఒత్తిడి చేసి , వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు.

రిమ్స్‌ను సందర్శించిన స్విమ్స్ వైద్య బృందం

ప్రజాశక్తి-కడప సిటీ



రిమ్స్ ప్రిన్సిపల్‌తో స్విమ్స్ వైద్య బృందం

డాక్టర్ ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ, విజయవాడ వారి తరపున కడపలో ప్రభుత్వ వైద్య కళాశాల(రిమ్స్)ను మంగళవారం తిరుపతి స్విమ్స్ వైద్య బృందం సందర్శించారు. ప్రస్తుతం కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో గైనకాలజీ, డెర్మటాలజీ, పీడియాట్రిక్ విభాగాలకు సంబంధించి పీజీ సీట్లను పెంపుదల చేసేందుకు ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. సురేఖ ఆధ్వర్యంలో డాక్టర్ ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ వారికి ప్రతిపాదనలు పంపారు. యూనివర్సిటీ తరపున తిరుపతి స్విమ్స్ వైద్యులు డాక్టర్ కిరీటి, డాక్టర్ శ్రీదేవి, ఇతర వైద్య బృందం విచ్చేశారు. వారు పరిశీ లించి నివేదికను కడప ప్రభుత్వ వైద్య కళాశాల తరపున ఎన్ఎంసికి ప్రతి పాదనలు పంపుతారు. వారి వెంట వైస్ ప్రిన్సిపల్ డాక్టర్. విజయభాస్కర్ రెడ్డి, గైనకాలజీ, పీడియాట్రిక్, డెర్మటాలజీ విభాగాల హెచ్ఒడిలు, వైద్యులున్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రుల నియామకం

కడపకు సవిత, అన్నమయ్యకు జనార్ధన్‌రెడ్డి

కడప జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత

అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జనార్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్/రాయచోటి

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులను ప్రభుత్వం నియమించింది. మంగళవారం రాష్ట్రంలోని 26 జిల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కడప జిల్లాకు అనంతపురం జిల్లా పెనుగొండ ఎమ్మెల్యేగా గెలిచి కేబినెట్‌లో బెర్త్ దక్కించుకున్న రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖా మంత్రి ఎస్.సవిత, అన్నమయ్య జిల్లాకు నంద్యాల జిల్లాకు చెందిన రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాల శాఖా మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డిలను నియమించింది. ఉభయ జిల్లాల సమగ్రాభివృద్ధికి సంబంధించిన సూచనలను, నిధుల కేటాయింపుల అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి ఉద్దేశించి నియామకాలను చేసింది. చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా తొలిసారి రాయచోటి ఎమ్మెల్యేగా గెలిచిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది.

జిల్లా పరిషత్ సిఇఒగా ఓబులమ్మ

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

బాధ్యతలు స్వీకరిస్తున్న ఓబులమ్మ

జిల్లా పరిషత్ సిఇ ఒగా సి.ఓబులమ్మ మంగ ళవారం బాధ్యతలు స్వీకరి ంచారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున అధికారులను బదిలీలు చేసిన సంగతి తెలిసిందే. జిల్లా పరిషత్ సిఇఒ సుధాకర్‌రెడ్డిని సత్యసాయి జిల్లా డిఎల్‌డిఒగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో అనంతపురం జిల్లా పరిషత్ సిఇఒ సి.ఓబులమ్మను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె రెండు వారాలుగా సిఇఒగా బాధ్యతలు స్వీకరించడానికి తటపటాయించడంతో సందేహాలు నెలకొన్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో బాధ్యతలు స్వీకరించినట్లు తెలుస్తోంది. బాధ్యతలు స్వీకరించిన సిఇఒ ఓబులమ్మ జడ్‌పి చైర్‌పర్సన్ శారదమ్మను కలిశారు. ఆమె వెంట మాజీ సిఇఒ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సిఇఒ మైథిలి ఉన్నారు. అంత కుముందు జడ్‌పి వైస్ చైర్మన్ బాలయ్య, ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు నాగిరెడ్డి, మల్లేశ్వరరెడ్డి, నాగభూషణం సిఇఒను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇసుకను సజావుగా పంపిణీ చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

సమావేశంలో మాట్లాడుతున్న శివశంకర్ లోతేటి

ప్రజలకు సజావుగా ఇసుక పంపిణీ చేసి ప్రభుత్వానికి మంచి పేరు ప్రతిష్టలు తేవాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లాలో ఇసుక పంపిణీ పై సంబంధిత అధికారులతో, ఇసుక ఏజెన్సీ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఏడు ఇసుక రీచ్‌లలో ఇసుక అందుబాటులోకి తీసుకొచ్చామని అన్నారు. పెండ్లిమర్రి మండలం పరిధిలోని నందిమండలం, కొత్త గంగిరెడ్డిపల్లి, కొండూరు, మాచనూరు, వల్లూరు మండలంలోని పైడి కాలువ, కొండాపురం మండలంలోని బెడుదూరు, చక్రాయపేట మండలంలోని మారెళ్ళ మడక ఇసుక రీచ్‌లలో ఈనెల 16 నుంచి ఆన్‌లైన్, ఆఫ్ లైన్ బుకింగ్ ద్వారా ఇసుకను బుక్ చేసుకోవచ్చునని చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆఫ్ లైన్ ద్వారా మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు చేసుకోవచ్చు అన్నారు. ఆఫ్ లైన్ ద్వారా రీచ్ వద్దకే వినియోగదారుడు వెళ్లి బుక్ చేసుకోవచ్చు అని చెప్పారు. ఇందుకు సంబంధించి వినియోగదారుడు సొంత వాహనం లేదా ప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన వాహనంలో ఇసుకను తీసుకోపోవచ్చునన్నారు. ఇందులో ఇసుకను 50 శాతం ఆన్‌లైన్ 50 శాతం ఆఫ్‌లైన్‌కు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. ఇ బుకింగ్ సంబంధించిన పంపిణీలో ఏపీ మేనేజ్మెంట్ యాప్ సిస్టంలో చేసుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో జెసి అదితి సింగ్, జిల్లా మైన్స్ అధికారి సూర్యచంద్రరావు, ఆర్ఐ విమలమ్మ, తాత్కాలిక ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన

ప్రజాశక్తి- వల్లూరు : అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు నేలకొరిగిన వరి పంటను జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు పరిశీలించారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలు గారి పల్లె గ్రామంలో నేలకొరిగిన వరి పంటను మండల వ్యవసాయ అధికారి సాయి జ్యోతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో వరి పొలాలు నీరు నిల్వ ఉండకుండా మురుగునీరు తొలగించి రైతులు జాగ్రత్త తీసుకోవాలని తెలియజేశారు. వాన తాకిడికి నేలకొరిగిన వరి కుదుళ్లను నిలబెట్టి గుంపులుగా కట్టి గింజ మొలకెత్తకుండా, రంగు మారకుండా లీటర్ నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపి పిచికారి చేయాలని తెలియజేశారు. వరిలో వాము కూడు తెగులు తగలకుండా వర్షం తగ్గిన వెంటనే హెక్సాకోనో జోల్ రెండు మిల్లీలీటర్లకు లేదా, ప్రోటీకోనజల్ ఒక మిల్లి మీ లీటర్ నీటిని కలిపి పిచికారి చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సురేఖ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ కంటే మద్యం పాలసీకే మొగ్గు

ప్రజాశక్తి - కడప

కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలు చేయడం కంటే మద్యం పాలసీ మేలనుకుందని వైసిపి కమలాపురం ఇన్‌ఛార్జి నరేన్ రామాంజుల రెడ్డి అన్నారు. మంగళవారం కడప జిల్లా వైసిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి కూటమి ప్రభుత్వం విధానంలో లిక్కర్ సిండికేట్‌కు రెక్కలు వచ్చాయి అన్నారు. మద్యం టెండర్ల వల్ల ఎపి ప్రజలు ఆనం దపడాలో, బాధపడాలో అర్థం కావడం లేదు అని అన్నారు. సూపర్ సిక్స్ అమలు చేయకుండా ప్రజల ఆరోగ్యాన్ని పాడు చేసే మద్యానికి మాత్రం టెండర్లు పిలిచారు అని అన్నారు. ఖజానా నిండుతుందని, రూ6 వేలు కోట్లు వస్తాయని చంద్రబాబు చెప్పారని పేర్కొన్నారు. ఇప్పుడు రూ. 3 వేల కోట్లు మాత్రమే వచ్చింది..ఈ టెండర్లు టిడిపి వారి జేబులు నింపింది అన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం, ఆరోగ్యం కంటే మద్యంపై ఆదాయమే ముఖ్యమని తేలిపోయిందన్నారు. మద్యం టెండర్లతో కేవలం టిడిపి నాయకులకే ఆదాయం వచ్చిందని, ప్రభుత్వానికి కాదని విమర్శించారు.

కడప అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎన్నికల్లో తాము ఇచ్చిన హామీకి కట్టుబడి, కడప నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని, కడప నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. మంగళవారం గాయత్రీ టవర్స్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో ఆ పార్టీ నాయకులు కాలువలు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలు చేశారని, వాటిని కూటమి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని చెప్పారు. షామీరియా బ్రిడ్జి, లా కాలేజీ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి తాను కట్టుబడి ఉన్నానని చెప్పారు. మంచినీటి సమస్యపై తాను వాటర్ గండి పంప్ హౌస్ పరిశీలించామని, నీరు సరఫరా అయ్యే పైపులు పాడైపోయినట్టు చెప్పారన్నారు. పుల్లగూర శేషయ్య హయాంలో ఏర్పాటు చేసిన పైపులైను 70 సంవత్సరాలు గడిచిందన్నారు. రూ.30 కోట్ల ఖర్చుతో నీటి సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇసుకపై జగన్ మాట్లాడడం హాస్యాస్పందంగా ఉందన్నారు. గత వైసిపి పాలనలో ఇసుక మాఫియా విచ్చలవిడిగా కొనసాగిందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు త్వరలో అమలు అవు తాయన్నారు. వైసిపి నేతల విష ప్రచారాలు ప్రజలు నమ్మొద్దని చెప్పారు.

ఎస్‌టి హాస్టళ్లలో జడ్జి తనిఖీలు

ప్రజాశక్తి - కడప

కడప నగరంలోని ఎస్‌టి హాస్టళ్లను మంగళవారం సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ తనిఖీ చేశారు. కడప నగరం మరియాపురం, ఐటిఐ సర్కిల్, చిన్నచౌకు, బుడ్డాయి పల్లెల్లోని బాలుర, బాలికల ఎస్‌టి హాస్టళ్లను జడ్జి సందర్శించారు. వంటశాలలను, వసతి గదులను, డైనింగ్ హాలును, స్టోర్ రూమ్, పరిసరాలను పరిశీలించారు. అధికారులకు, నిర్వాహకులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, మొదలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ట్రైబల్ హాస్టల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రయివేట్ ట్రావెల్స్ దోపిడీని అరికట్టాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్ : ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని దోపిడీ చేస్తున్న ప్రయివేట్ ట్రావెల్స్ యజమాన్యాలపై చర్యలు తీసుకుఓవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దసరా పండుగ సీజన్‌లో ప్రజల అవసరాలను అవకాశంగా తీసుకుని జిల్లా లో ప్రయివేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు ప్రజల వద్ద నుంచి అధిక రీతిలో ఛార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. పండుగ పూట రావాలన్నా, తిరిగి వెళ్లాలన్నా ప్రజలు భయపడే రీతిలో ట్రావెల్స్ యజమానులు ఛార్జీలు వసూలు చేస్తున్నాయని పేర్కొన్నారు. విజయవాడ, హైదారాబాద్ వంటి ప్రాంతాలకు రూ.3000 నుంచి రూ.50000 వరకు ఛార్జీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. యథేచ్ఛగా ఆన్‌లైన్‌లోలోనే అధిక మొత్తంలో ధరలు చూపిస్తున్నా రవాణా శాఖ అధికారులు పట్టించుకోలేదు అంటే ఏ స్థాయిలో నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం అవుతుందన్నారు. కేవలం రవాణా శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ఇదంతా జరుగుతుందన్నారు. ఇప్పటికైనా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఇటువంటి ప్రయివేటు ట్రావెల్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో డివైఎఫ్ఐ గా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ కె. రాకేష్ చంద్ర చిన్నచౌక్, కో-ఆపరేటివ్ కాలనీ, రాజా రెడ్డివీధిలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను మంగళవారం పర్యవేక్షించారు. శుభ్రత ప్రమాణాలను పాటించడం ఎంత ముఖ్యమో అధికారులకు తెలిపారు. వ్యర్థాలను సమయానుకూలంగా తొలగించడం, పరిసరాల పరిశుభ్రతను నిర్వహించడం ద్వారా ప్రజల ఆరోగ్యానికి హానికరమైన సమస్యలు రాకుండా చూడాలని సూచించారు. పర్యవేక్షణలో భాగంగా గుర్తించిన ప్రాంతాలలో పారిశుధ్య కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని, వ్యర్థాలు సమయానికి సేకరించి, శుభ్రత పనులను పటిష్టంగా కొనసాగించాలని ఆదేశించారు.

ఎఎస్ఐ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కడప అర్బన్ : బద్వేలు రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఎఎస్ఐ ఆర్.అన్వర్ కుటుంబానికి ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు అదనపు ఎస్.పి (పరిపాలన) కె.ప్రకాష్ బాబు రూ.2.లక్షల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో అందచేశారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో .అన్వర్ సతీమణి బీబీజాన్‌కు చెక్కును అందచేశారు. పోలీస్ సంక్షేమంలో భాగంగా ఏర్పాటు చేసిన పోలీస్ వితరణ నిధి నుంచి అందజేశారు. పిల్లల చదువులకు, కుటుంబానికి తాము అండగా ఉంటామని ఎఎస్‌పి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డిపిఒ ఎన్.జ్యోతి, బి.సెక్షన్ సూపరింటెండెంట్, బి.శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

'బాలగొండ'కు అవార్డు అభినందనీయం

గంగాధర్‌ను సన్మానిస్తున్న అతిథులు

ప్రజాశక్తి - కడప అర్బన్ : చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్‌కు రాష్ట్ర పర్యాటక ఎక్సలెన్స్ అవార్డు లభించడం జిల్లా ప్రతిష్టను పెంచినట్లయిందని ఎ ఎస్‌సి కార్పొరేషన్ ఇడి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. గంగాధర్‌కు అవార్డు లభించిన సందర్భంగా మంగళవారం శిల్పకారుడు గొల్లపల్లి జయన్న ఆధ్వర్యంలో లలిత కళాభిరామ పింఛము సంస్థ ఆయనను ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగాధర్ చరిత్ర అధ్యాపకుడు మాత్రమే కాదని, చారిత్రక అంశాలపై లోతైన పట్టుదల ఉన్న వ్యక్తి అన్నారు. ప్రొద్దుటూరు జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ మోరంరెడ్డి వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ టూరిజం అభివృద్ధి కోసం కడప నగరంలోని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటి లాంటి సంస్థలకు లలిత కళాభిరామ పింఛము తదితర సంస్థలు తోడుగా నిలుస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా శిల్పకారుడు జయన్న, మంజుల దంపతులు అవార్డు గ్రహీత బాలగొండ గంగాధర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య పూర్వ అధ్యక్షులు లయన్ పోతుల వెంకట్రామిరెడ్డి, గొల్లపల్లి జయన్న, రాయలసీమ టూరిజం సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు, వెంకట రమణ, గొబ్బూరి కోటేశ్వరరావు, నసీబ్, శంకర రెడ్డి, రంగనాథ్ పాల్గొన్నారు.

అల్లాడుపల్లెలో సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె, చాపాడు, పెద్ద గురువలూరు గ్రామ పంచాయతీలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సిసి రోడ్ల నిర్మాణానికి అధికారులు, టిడిపి నాయకులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రామానుజం మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సహకారంతో ఉపాధి చట్టం నిధులు ఉపయోగించి సిసి రోడ్లు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఉపాధి ఎపిఒ జగదీశ్వర్ రెడ్డి, టిడిపి నాయకులు పెరుగు వీర నారాయణ యాదవ్, గోసుల వీరారెడ్డి, క్రిష్ణారెడ్డి, వేంకటేశ్వర రెడ్డి, చాపాడు సర్పంచ్ మహబూబ్ బీ, హర్షవర్ధన్ రెడ్డి, అక్బర్, సలీం, పెద్దగురువలూరు సర్పంచ్ పాలగిరి రాజేష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సింహాద్రిపురం : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని టిడిపి పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి(బీటెక్ రవి) పేర్కొన్నారు. మంగళవారం సింహాద్రిపురంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సన్నన, పిఆర్ డిఇ సుధాకర్‌రెడ్డి, ఉపాధి ఎపిడి సుబ్బారెడ్డి, ఎంపిడిఒ కృష్ణమూర్తి, పిఆర్ ఎఇ ఉదయ్‌కుమార్ రెడ్డి, ఎపిఒ జయభారతి, ఇసి శ్రీనివాసరెడ్డి, మండల టిడిపి నాయకులు పుప్పాల శ్రీధర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ వెంకట రాముడు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ముద్దనూరు : తిమ్మాపురం గ్రామంలో మంగళవారం ఎంపిడిఒ ముకుందరెడ్డి ఆధ్వర్యంలో పల్లె పండుగ వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. కె.తిమ్మాపురం గ్రామ పంచాయతీలో రూ.10.70 లక్షలు వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.రాజ్యలక్ష్మి, నాయకులు ప్రసాద్‌రెడ్డి, ఈఓపిఆర్డీ వీరభద్రుడు, ప్రజలు పాల్గొన్నారు.

వేముల : గంగిపల్లె గ్రామ పంచాయతీలోని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న పలు అంశాలను ఆయన ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో సర్పంచ్ దేవన రామాంజనమ్మ, దేవన రామాంజనేయులు, అధికారులు, కూటమి వేముల తెలుగు యువత అధ్యక్షుడు ఆసం విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హనుమంతురెడ్డి, లోకేపల్లి నాగభూషణ్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పెద్దముడియం : మండల కేంద్రమైన పెద్దముడియంలో ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, నియోజక వర్గ ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి నేతృత్వంలో మండల అధికారులు పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా సుమారు రూ.78 లక్షలతో సిమెంట్ రోడ్లకు, కాంపౌండ్ వాల్స్, శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిఇఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

నిబంధనలు అమలు చేయాల్సిన విషయంలో డిఇఒ అనూరాధ ఉద్దేశపూర్వకంగా జాప్యం వహిస్తున్నారని, ఆమెపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రయివేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ సంఘ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కడప జిల్లాలో సుమారు 700కు పైగా ప్రయివేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయన్నారు. అందులో సుమారు 10వేలకు పైగా ప్రయివేట్ ఉపాధ్యాయులు ఎలాంటి హక్కులకు నోచుకోకుండా పనిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాసంస్థల యాజమాన్యాలతో చట్టాలను అమలు పరచాల్సిన విషయంలో జిల్లా విద్యాశాఖాధికారి పూర్తిగా ఉద్దేశపూర్వకంగా విఫలమయ్యారని ఆరోపించారు. జిల్లాలో ఎక్కడా జి.ఒ.ఎం.ఎస్ నెంబర్-1 అమలుకు నోచుకోవడం లేదన్నారు. బ్యాంకు ఖాతా ద్వారా జీతాలు చెల్లించడంలేదన్నారు. 1982 విద్యాచట్టం ఎక్కడా అమలు కావడం లేదన్నారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు, ప్రిన్సిపాల్ సెక్రటరీకి ఆధారాలతో ఫిర్యాదు చేస్తామని గడ్డం రాజు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

క్రైం కార్నర్

దుకాణంలోకి దూసుకెళ్లిన లారీ

ప్రజాశక్తి - ముద్దనూరు

జమ్మలమడుగు వైపు నుంచి నల్ల కార్బన్ పౌడర్ లోడుతో ముద్దనూరుకు వస్తున్న లారీ అదుపు తప్పి బస్సు, బ్రిడ్జి, విద్యుత్ స్తంభాలు, కారు, ఆటోను ఢీకొని ఓఇంట్లోకి దూసుకెళ్లింది. ఆర్‌టిపిపికి చెందిన ఉద్యోగి రవి థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి పులివెందులకు కారులో వెళుతూ.. ముద్దనూరులో రైల్వేగేట్ వేయడంతో పక్కన నిలిచి ఉన్నారు. లారీ అతి వేగంగా వచ్చి కారును ఢీ కొట్టడంతో కారు వెనుక భాగం దెబ్బతిని వెనక్కు తిరిగింది. రోడ్డు పక్కన ఇంటి ముందు ఉన్న చెట్లు, అండర్ డ్రెయినేజీకి ఏర్పాటు చేసిన మూతను, విద్యుత్ స్తంభాన్ని ఢీ కొంది. ఆటో నుజ్జునుజ్జు అయిపోయి లారీతో పాటుగా ఆటో అంగడి, ఇంట్లోకి దూసుకెళ్లింది. లారీ ఆర్‌టిపిపికి వెళ్లే దారికి అడ్డుగా నిలిచింది. ప్రమాదంలో ఎలాంటి ప్రాణహాని జరగక పోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. జాతీయ రహదారి కోసం ముద్దనూరులోని శివాలయం వద్ద నుండి కడప జాతీయ రహదారి మీదుగా వాహనాలు వెళ్లేందుకు ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఏర్పాటు చేశారు. లారీలు ఫ్లై ఓవర్ బ్రిడ్జి పైన వెళ్లకుండా ఇలా ఊర్లో నుండి రావడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు లారీలు రైల్వే గేట్ ఢీకొని ఇళ్లలోకి దూసుకెళ్లాయని ఆందోళన వ్యక్తం చేశారు. భారీ వాహనాలు, లారీలు ఊరిలో రాకుండా ఫ్లై ఓవర్ మీద వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దళితుడిపై టిడిపి నాయకుల దాడి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని బలపనూరులో దళితుడిపై టిడిపి నాయకులు దాడి చేసినట్లు ఎస్ఐ తులసి నాగ ప్రసాద్ తెలిపారు. ఆ మేరకు మంగళవారం ఎస్ఐ మాట్లాడుతూ బలపనూరు గ్రామంలోని దళిత వర్గానికి చెందిన భార్గవ్‌పై అదే గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి మరో నలుగురు తీవ్రంగా గాయపరిచారన్నారు. కులం పేరుతో దూషించారని తెలిపారు. భార్గవ్‌ను పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించామ న్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలపారు.

ఐదుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీ పరిధిలోని చింతలమడుగుపల్లెలో జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. మంగళవారం వచ్చిన సమాచారం మేరకు చింతలమడుగుపల్లె సమీపంలో జూదం ఆడుతున్న వారిపై సిఐ సురేష్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐ తన సిబ్బందితో దాడులు చేశారు. జూదరుల వద్ద నుంచి రూ.5,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

శ్మశానానికి హద్దులు, రోడ్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండల కేంద్రంలో ఆక్రమణకు గురైన శ్మశాన స్థలానికి హద్దులు చూపి, రోడ్డు ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.శివకుమార్ డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో శ్మశాన స్థలంలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్రమణకు గురైన శ్మశానాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని మొత్తం స్థలాన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. సోమిరెడ్డి పల్లె రెవెన్యూ పొలం 464 సర్వే నెంబర్‌లో 10 ఎకరాల 5 సెంట్ల భూమిని 30 సంవత్సరాల క్రితం శ్మశానానికి కేటాయించారని, దీన్ని కొత్తూరు, పాతూరు, కక్కయ్య నగర్, వీరనారాయణపురం, విరాట్ నగర్, ప్రభునగర్, సుందరయ్య నగర్, జింకల నగర్, పోలేరమ్మ నగర్, కొత్త బస్వాపురం మొదలగు ప్రాంతాలలోని అన్ని కులాల వారు అంత్యక్రియలకు వినియోగించుకుంటున్నారని శివకుమార్ తెలిపారు. శ్మశాన వాటికకు కేటాయించిన స్థలంలో దాదాపు 8 ఎకరాలు ఆక్రమణకు గురైందన్నారు. దీనిపై సిపిఎం మండల కమిటీ పలుమార్లు ఆందోళనలు చేసినా అధికారులు నాన్చుడు ధోరణిని అవలంభిస్తున్నారని పేర్కొన్నారు. రోజురోజుకూ మండల కేంద్ర జనాభా పెరుగుతున్న దృష్ట్యా ప్రస్తుతం ఉన్న రెండెకాలు ఏ మేరకు సరిపోదని వివరించారు. శ్మశానం ముందు భాగం రిజిస్టర్ స్థలం కావడంతో సమాధి యజమానులు హద్దులు ఏర్పాటు చేసుకున్నారని, గత రెండేళ్లుగా చనిపోయిన వారిని శ్మశానానికి తీసుకు వెళ్లాలంటే అనేక అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. దారి కూడా లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంజనేయస్వామి గుడి దగ్గర నుండి వంకపోరం బోకు ఒక స్థలం ఉన్నప్పటికీ దాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించడంతో శ్మశానానికి దారి లేకుండా పోయిందని తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని, లేని పక్షంలో అన్ని వర్గాల ప్రజలను, కలసివచ్చే అన్ని రాజకీయ పార్టీలను, ప్రజాసంఘాలను కలుపుకొని తీవ్ర ఆందోళనలు నిర్వ హించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గండి సునీల్‌కుమార్, కార్యకర్తలు మునయ్య, గురయ్య, బిగ్‌బాస్ శివరాం, హుస్సేన్, వెంకటరమణ పాల్గొన్నారు.

శ్మశానాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

విద్యాభివృద్ధికి బాసట వైజిఆర్ ట్రస్ట్

గతేడాది పదిలో ఉత్తమ మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహకం - నవంబర్‌లో ఉపాధి శిక్షణ తరగతులు

గతేడాది 'పది'లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో ట్రస్ట్ చైర్మన్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో విద్యాభివృద్ధికి వైజిఆర్ ట్రస్ట్ బాసటగా నిలుస్తోంది. గతేడాది మండలంలోని నంద్యాలం పల్లె గ్రామానికి చెందిన ఎర్రనాగు శ్రీధర్‌రెడ్డి తమ కుటుంబ సభ్యుల పేరుతో ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. దానికి ఆయనే చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారు. తాను సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నత స్థాయిలో ఉన్నప్పటికీ మండలంలో విద్యాభివృద్ధి కోసం పాటుపడుతున్నారు. ముఖ్యంగా గతేడాది మండలంలోని 8 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి చదివిన 24 మంది విద్యార్థులకు మొదటి, రెండవ, మూడవ బహుమతుల కింద ఒక్కరికి రూ.4000, రూ.3000, రూ.2000 చొప్పున అందజేశారు. అలాగే విద్యార్థులకు మెమొంటో కూడా అందజేశారు. ఈ సందర్భంగా ప్రముఖులను ఆహ్వానించి విద్యాభివృద్ధి కోసం తీసుకోవాల్సిన సూచనలు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించారు.

నవంబర్‌లో ఉద్యోగ, ఉపాధికి అవగాహన సదస్సులు..

వచ్చే నెల నవంబర్‌లో విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి కోసం వివిధ రంగాలలో అనుభవం ఉన్న సభ్యులచే సదస్సులు నిర్వహించడానికి చర్యలు చేపట్టారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఇంటర్మీడియట్, డిగ్రీ, పాలిటెక్నికల్, ఇంజనీరింగ్, ఐటిఐతోపాటు వివిధ చదువులు చదివిన వారు అనేకమంది ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారిని గుర్తించి వారి చదువుకు తగ్గట్టు అనుభవం కలిగిన వారిచే అవగాహన కల్పించనున్నారు. అనంతరం వారికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, బీటెక్ చదివిన విద్యార్థులకు ఉన్నత చదువులు చదవడానికి ఉన్న అవకాశాలపై సమగ్రంగా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించేలా ఒక టీంను ఏర్పాటు చేసి అవగాహన కల్పించనున్నారు.

పేద విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యం..

గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థుల అభ్యున్నతే తమ లక్ష్యం. ఇప్పటికే పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశాం. ఈ ఏడాది ఈ కార్యక్రమంతోపాటు ఉన్నత చదువులు చదవడానికి ఉన్న అవకాశాలపై అనుభవం కలిగిన వారితో అవగాహన సదస్సులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని మండలంతోపాటు నియోజకవర్గం, జిల్లా స్థాయిలో తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటాం.

- ఎర్రనాగు శ్రీధర్‌రెడ్డి, వైజిఆర్ ట్రస్ట్ చైర్మన్

నూతన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - చాపాడు

కార్యక్రమంలో ఎంపిపి, ఎఒ, రైతులు

వ్యవసాయంలో నూతన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఎంపిపి టి. లక్షుమయ్య సూచించారు. ఎఒ మ్యాగీ ఆధ్వర్యంలో మంగళవారం కుచ్చుపాప, చిన్నగురువలూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్నిత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వ్యవసాయంలో సాగు ఖర్చులు అధికమయ్యాయన్నారు. నిలకడ లేని ధరలతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దిగుబడులు అధికంగా సాధిస్తేనే ఆర్థికంగా రైతులు నిల దొక్కుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎఒ మ్యాగీ మాట్లాడుతూ సాగుచేసిన పంటలకు చీడపీడలు సోకగానే పురుగు మందులు పిచికారీ చేసి పంటను కాపాడుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామసుబ్బారెడ్డి, ఎల్లారెడ్డి, విఎఎ మాధవిలత, రైతులు పాల్గొన్నారు.

మైదుకూరు(చాపాడు) : మైదుకూరు మండలం శివపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు ముఖ్య అతిథిగా కెవికె శాస్త్రవేత్త వీరయ్య మాట్లా డుతూ ప్రస్తుతం వరిలో వచ్చే చీడపీడలను ఏ రకంగా అరికట్టాలో వివ రించారు. రైతులందరూ భాస్వరం ఎరువులను దుక్కిలో చేసుకోవాలన్నారు. యూరియా, పొటాషియం ఎరువులను పై పాటుగా చేసు కోవాలన్నారు. 20, 45 రోజులకు ఒకసారి ఎరువులను వేసు కోవాలన్నారు. జొన్నలో వచ్చే కాండం తొలిచే పురుగు నివారణకు కార్బోఫ్యూరన్ గుళికలను సుడులలో వేసు కోవాలన్నారు. కార్యక్రమంలో ఎడిఎ కృష్ణమూర్తి, ఎఒ పి ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యం మన చేతుల్లోనే..

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని వైఎంఆర్ కాలనీ పట్టణ ఆరోగ్య ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నల్లబల్లి హిమబిందు తెలిపారు. ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన సమావేశం ఏర్పాటు చేసి, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ శుభ్రమైన చేతుల్లోనే మన ఆరోగ్యం ఉందన్నారు. భోజనానికి ముందు భోజన తర్వాత.. మల విసర్జన అనంతరం, దగ్గినపుడు, తుమ్మినపుడు, ఆటలు ఆడుకున్న తర్వాత చేతులు శుభ్రపరచుకోవాలన్నారు. చేతులు శుభ్రపరచుకొను ఆరు స్టెప్పులను ఆశాలతో చేయించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ సుబ్బారెడ్డి, ఆరోగ్యకార్యకర్తలు, ఆశాలు, యుపిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని వెదురూరు గ్రామ సమీపంలో పెన్నా నది నుంచి అక్రమంగా ఇసుక తరలించకుండా చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కొంతమంది రాత్రి సమయాల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో సిబ్బందిని పంపి నది నుంచి ఇసుక తరలించే మార్గాలను గుర్తించామన్నారు. ఈ మార్గాలను జెసిబి యంత్రాల సాయంతో కాలువలు తీసి వాహనాలు రాకుండా చర్యలు చేపట్టామన్నారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘర్షణలకు దూరంగా ఉండాలి

చాపాడు : గ్రామాల్లో ప్రజలు ఘర్షణలకు దూరంగా ఉండాలని ఫ్యాక్షన్ జోన్ సీఐ పుల్లయ్య సూచించారు. మంగళవారం మండల పరిధిలోని చిన్న వరదాయపల్లి,

నక్కలదిన్నె గ్రామాల్లో చాపాడు ఎస్ఐ చిన్న పెద్దయ్య ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. గొడ వలకు దిగితే తద్వారా చాలా అనర్థాలు ఎదురవుతాయని వివరించారు. ఫ్యాక్షన్ వల్ల ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటిలో ఆన్‌లైన్ ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక రూరల్ పరిధిలోని సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు బెంగళూరు గ్లోబల్ క్రిస్ట్ టెక్నాలజీస్ కంపెనీ ఆన్‌లైన్ ప్రాంగణ ఎంపికలు నిర్వహించిందని ప్రిన్సిపల్ పాండురంగన్ రవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీటెక్ ఫైనల్ ఇయర్ అన్ని బ్రాంచ్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోస్టులకు ఈసీఈ విద్యార్థి నాగ వైష్ణవి, ఈఈఈ నికిత, రేణుక, సిఎస్సిడి నఫీసా, పి.వెంకట మాధవ్ ఎంపికయ్యారన్నారు. టిపిఓ సునీల్ మాట్లాడుతూ వీరికి మూడు నెలల శిక్షణ అనంతరం ఉద్యోగాల్లో చేరుతారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ వీరకుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీర కల్యాణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఏ వెంకటేశ్వరరెడ్డి,హెచ్‌ఓడిలు అభినందించారు.

ఇంటర్ ఆర్‌జెడి అవినీతిపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

రాయలసీమ జిల్లాల ఇంటర్మీడియట్ ఆర్‌జెడి రవి అవినీతిపై విచారించి చర్యలు తీసుకోవాలని విద్యార్థి యువజన సంఘాల నాయకులు జగదీష్, ఓబులేసు కత్తి, నాగరాజు, రమేష్ డిమాండ్ చేశారు. ఆ మేరకు వారు పట్టణంలోని పాలిటెక్నికల్ కళాశాల వద్ద మంగళవారం నిరాహార దీక్ష పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఇంటర్మీడియట్ ప్రాంతీయ సంయుక్త కళాశాలల అధికారిగా కొనసాగుతున్న రవిని వెంటనే ప్రభుత్వం సరెండర్ చేసుకోవాలన్నారు. ఆయన చేసిన అవినీతి, అక్రమాలపై విచారించాలన్నారు. ఆయన కడప జిల్లాలో ఒక కళాశాలకు ప్రిన్సిపల్‌గా ఉంటూ దాదాపు 15 ఏళ్లుగా ఆర్ఐఒ, డివిఇఒ, ఆర్‌జెడిగా కొనసాగుతూ ఎయిడెడ్ ప్రభుత్వ లెక్చరర్ల పోస్టుల నుంచి టైపిస్టు, కాంట్రాక్ట్ లెక్చరర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టుల వరకు అక్రమ మామూళ్లకు తెరలేపి ఇంటర్మీడియట్ విద్యను అవినీతిమయంలోకి నెట్టారన్నారు.

సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

వ్యాపారులు తమ దుకాణాలలో సిసి కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ తులసి నాగప్రసాద్ సూచించారు. మంగళవారం సాయంత్రం మండలంలోని వ్యాపారులతో ఇటీవల జరుగుతున్న చోరీలపై ఆయన అవగాహన కల్పించారు. ముఖ్యంగా వ్యాపారులు తమ దుకాణాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే చోరీ జరిగే అవకాశం ఉండదన్నారు. ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రదేశ ప్రాంతాల్లో ఇటీవల చోరీలు జరుగుతున్నాయన్నారు. ప్రజల అప్రమత్తంగా వ్యవహరిస్తూ దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు, ప్రొద్దుటూరు నందు

E.P.No. 41/2021 in O.S.No. 174/2018

సానేపల్లి శివారెడ్డి S/o పెద్ద వీరారెడ్డి,
50 సం॥లు, రేగళ్ళపల్లి గ్రామం, ప్రొద్దుటూరు (మం), కడపజిల్లా ..**పిటిషనర్ /డిక్రీ హోల్డర్**

VS

శావలి శ్రీహరి @ శ్రీహరి యాదవ్,S/o వెంకట రమణయ్య
డి.నెం.7/3833-6,కొప్పరపు భీమయ్య కాలనీ,
ప్రొద్దుటూరు టౌన్ & మండలం, కడపజిల్లా
..**రెస్పాండెంట్/J.DR**

రెస్పాండెంట్‌కు ఆర్డర్ 21 రూల్ 22 సివిల్ ప్రొసీజర్ కోడ్ నోటీసు

పై ఎగ్జిక్యూషన్ పిటిషన్ నందు 2 సం॥లు తర్వాత పిటిషన్ వేసి ఉన్నందున రెస్పాడెంట్ అయిన మీకు ఆర్డర్ 21 రూల్ 22 CPC ప్రకారం షోకాజ్ నోటీసు ఇవ్వమని పై కోర్టు వారు ఆదేశించిఉన్నారు. పై పిటిషన్ నందు మీరు హాజరగుటకు గాను 08.11.2024వ తేదీన వాయిదా ఉన్నది. కావున సదరు తేదీన **ఉదయం 10-30 గంటలకు** మీరు ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలను. లేనందట మీ పరోక్షమున తీర్మానించబడును

// BY ORDER OF THE COURT //

జింకా రవి, మెట్టుపల్లె సురేంద్రనాథ రడ్డి
అడ్వకేట్స్, ప్రొద్దుటూరు,కడప జిల్లా

మహారాజశ్రీ కడప జిల్లా 1వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

M.V.O.P.No. 349/2022

కొమ్మద్ది మస్తాన్‌వల్లి, S/o బాబాఫక్రుద్దీన్, డోర్‌నెం.3/42, అలిదిన ఓబాయపల్లి, వీరపునాయునిపల్లి మండలం, కడప జిల్లా. **...పిటిషనరు**

Vs

R1. గగ్గుటూరు గౌస్‌పీరా, S/o రక్తావల్లి, 26 సం॥లు, డోర్‌నెం. 9/489, శివాయలం వీధి, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా. డ్రైవర్ AP04 TW-2630.
...రెస్పాండెంట్ నెం.1

పై నంబరులోని పిటిషన్‌రు U/S 166 మం.వి.యాక్ట్ ప్రకారం 9.1.2022న జరిగిన యాక్సిడెంటులో తగిలిన దెబ్బలకు గాను నష్టపరిహారం కోరి పై కేసు దాఖలు చేసియున్నాడు. 1వ రెస్పాండెంట్ అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 24.10.2024న ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు ఎదుట హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల ఎక్సుపార్టీగా తీర్మానించబడును.

//By Order of the Court//

జి.వి.రాఘవరెడ్డి
అడ్వకేటు, కడప.

మహారాజశ్రీ కడప జిల్లా 1వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో

M.V.O.P.No. 348/2022

1. నూకనబోయిన గంగాదేవి, W/o Late జయరాముడు.
2. నూకనబోయిన రవికాంత్, S/o Late జయరాముడు.
అలిదినె ఓబాయపల్లి గ్రామం, వీరపునాయునిపల్లి మండలం, కడప జిల్లా.
3. నూకనబోయిన జయశ్రీ, D/o Late జయరాముడు. C/o.K.రాజశేఖర్, డోర్‌నెం. 3-34/2, గొల్లపల్లి గ్రామం, పాకాల మండలం, చిత్తూరు జిల్లా.
4. మోపూరి రాజేశ్వరి, W/o ఎమ్.నరసయ్య, D/o Late ఎన్.జయరాముడు, చింతకుంట గ్రామం, నందలూరు మండలం, అన్నమయ్య జిల్లా.

...పిటిషనర్లు

Vs

R1. గగ్గుటూరు గౌస్‌పీరా, S/o రక్తావల్లి, 26 సం॥లు, డోర్‌నెం. 9/489, శివాయలం వీధి, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా. డ్రైవర్ AP04 TW-2630.
...రెస్పాండెంట్ నెం.1

పై నెంబరులోని పిటిషనర్లు సెక్షన్ 166 యం.వి.యాక్టు ప్రకారం 9.1.2022న జరిగిన యాక్సిడెంట్‌లో నూకనబోయిన జయరాముడు చనిపోయినందున నష్టపరిహారం కోరి పైకేసు దాఖలు చేసియున్నాడు. 1వ రెస్పాండెంట్ అయిన మీకు ఏమైన ఆక్షేపణలున్న ఎడల 25.10.2024న ఉదయం 10.30 ని॥ పై కోర్టు ఎదుట హాజరై తెలుపుకొనవలయును. లేనిఎడల ఎక్సుపార్టీగా తీర్మానించబడును.

//By Order of the Court//

జి.వి.రాఘవరెడ్డి
అడ్వకేటు, కడప.

మొక్కలు నాటుతున్న ఆర్‌డిఒ ప్రత్యూష

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని ఆర్‌డిఒ గణేష్ణ భాను శ్రీ అన్నపూర్ణ ప్రత్యూష సూచించారు. పట్టణ పరిధిలోని ఆహార విజ్ఞానశాస్త్ర సాంకేతిక కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం, కళాశాల జాతీయ సేవా పథకం, స్నేహిత అమృత హస్తం సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన అబ్దుల్ కలాం జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కళాశాల ఆవరణలో అమ్మ పేరు మీద ఒక మొక్క నాటుదాం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి, నీరు పోసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ మాధవ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి నివేదిత, జయమ్మ, అరుణ, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్, సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మైదుకూరు(చాపాడు) : నెహ్రూ యువ కేంద్రం, అమ్మ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని అమ్మ పేరు మీద ఒక మొక్క నాటుదాం కార్యక్రమాన్ని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అమ్మ సేవా సమితి అధ్యక్షులు వాగ్దాడం శివశంకర్, జాతీయ సేవా పథకం అధికారి శంకర్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆదరణ సేవా సంస్థ నిర్వాహకులు కిన్నెర ప్రసన్నకుమార్, కళాశాల సిబ్బంది చంద్ర, పుల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లె : భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న, క్షిపణి పితామహుడు ఎపిజె అబ్దుల్ కలాం గొప్ప దార్శనికుడు, మార్గదర్శిని అని ఎపిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. అబ్దుల్ కలాం 93వ జయంతిని మంగళవారం కాంగ్రెస్ నాయకులు వేంపల్లెలో ఘనంగా నిర్వహించారు. కలాం చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, ధ్రువకుమార్‌రెడ్డి, రామకృష్ణ, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, వినయ్, సుబ్బరాయుడు, వెంకటేష్, మహబూబ్ బాషా, మదార్, నాగరాజు, వేమారాజా, వేమయ్య, బద్రి, రవి పాల్గొన్నారు.

కడప అర్బన్ : కృషి, పట్టుదలతో తన వంతుగా మన భారతదేశానికి రాష్ట్రపతిగా సేవలు అందించిన ఎపిజె అబ్దుల్ కలాంను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల ప్రిన్సిపల్ సూర్యారావు అన్నారు. ఆర్కే రాయల్ కరీం సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం అబ్దుల్ కలాం 93 జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కళాశాల ఉర్దూ అధ్యాపకులు డాక్టర్ అంజద్ బాషా, కరీముల్లా ,అధ్యాపకులు డి.బాగ్యలక్షుమ్మ, భరత్, చంద్రమోహన్‌రెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో.. భారతదేశానికి 11వ రాష్ట్రపతిగా ఎపిజె అబ్దుల్ కలాం ఎన్నికై భారత దేశ ప్రజలు గుర్తు ఉండేలా సేవలు అందించరని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఎస్. అమీర్ బాబు అన్నారు. మంగళవారం రహమతీయ ఫంక్షన్ హాల్‌లో ఎపిజె అబ్దుల్ కలాం 93వ జయంతి సందర్భంగా కలాం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అబ్దుల్ కలాం ఉదయం దిన పత్రికలను పంపిణీ చేస్తూ కృషి, పట్టుదలతో రాష్ట్రపతిగా పదవి చేపట్టడం ఎంతో విశేషమని కొనియాడారు. 1997 సంవత్సరంలో అబ్దుల్ కలాంకు భారత ప్రభుత్వం భారతరత్న బిరుదు ఇచ్చి సత్కరించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కరీముల్లా. యూ. ఎమ్. ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఫీ ఖాన్, బి. ఏ.చాంద్ బాషా, అమానుల్లా పాల్గొన్నారు.

పంట నమోదుపై సామాజిక గ్రామసభలు

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని బొందలకుంట, శెట్టివారిపల్లె గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం ఎఒ వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇ-పంట నమోదుకు సంబంధించి సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో 2024 ఖరీఫ్‌లో సాగు చేసిన పంట నమోదు వివరాలు, రైతుల జాబితాను రైతుల సమక్షంలో ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ తుది జాబితాలో రైతులు, సాగు వివరాల్లో తప్పులు ఉంటే సిబ్బందికి తెలిపి సరి చేసుకోవచ్చన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేస్తే వాటిని పరిశీలించి జాబితా నుండి తొలగిస్తామన్నారు. పంట నమోదు పారదర్శకంగా చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బసయ్య, లక్ష్మినారాయణ, రైతులు పాల్గొన్నారు.

అడిగిన సమాచారాన్ని తప్పక ఇవ్వాలి

ప్రజాశక్తి - చాపాడు

పౌరులు అడిగిన సమాచారాన్ని సిబ్బంది తప్పకుండా ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి మ్యాగీ సూచించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం సమాచార హక్కు చట్టంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు కార్యాలయానికి వచ్చి ఏదైనా సమాచారం అడిగితే ఇవ్వాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ప్రజలు కూడా తమకు కావాల్సిన సమాచారమేదైనా రాతపూర్వకంగా అడిగే హక్కు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, విఎఎలు పాల్గొన్నారు.

రూ.10 నాణేలతో లవాదేవీలు నిర్వహించొచ్చు

ప్రజాశక్తి - దువ్వూరు

నాణేలను బదలాయిస్తున్న ఎపిజిబి మేనేజర్

రూ.10 నాణేలు చెల్లుబాటు కావనే వదంతులు సృష్టించవద్దని, అందరు వాటితో లావాదేవీలు జరుపవచ్చని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ దువ్వూరు బ్రాంచ్ మేనేజర్ సింగం రమణ తెలిపారు. ప్రజలు, వ్యాపారుల్లో రూ.10 నాణేలపై ఉన్న అపోహలను తొలగించి, దువ్వూరు గ్రామంలో రూ.60వేలకు సరిపడ రూ.10నాణేలను గ్రామంలో వ్యాపారులకు ప్రజలకు బదలాయించారు. నాణేల పట్ల అందరూ సానుకూలంగా స్పందించాలన్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No. 321/2010

1. మోపూరు వెంకటసుబ్బారెడ్డి, చనిపోయినందున వారసులు
2. మోపూరు శోభ మరియు ఇతరులు **...వాదులు**

Vs

8. నరాల విమల, D/o లేట్ నారాయణమ్మ, వయస్సు 48 సం॥లు, హిందూ, గృహిణి
9. నరాల శ్రీధర్‌రెడ్డి, S/o వేణుగోపాల్‌రెడ్డి, వయస్సు 46 సం॥లు, హిందూ
10. నరాల సరల, W/o రామచంద్రారెడ్డి, వయస్సు 44 సం॥లు, హిందూ,
11. సింగారెడ్డి యశోద, D/o విజయకుమారి, వయస్సు 44 సం॥లు, హిందూ, గృహిణి,
12. సింగారెడ్డి మహేశ్వరరెడ్డి, S/o వేమారెడ్డి, వయస్సు 42 సం॥లు, హిందూ,
13. సింగారెడ్డి వినోద్‌రెడ్డి, S/o వేమారెడ్డి, వయస్సు 40 సం॥లు, హిందూ,

8 నుండి 13 సాకిన్ డోర్‌నెం.17/123, సుబ్బిరెడ్డిగారి వీధి, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా.
...ప్రతివాదులు నెం. 8 నుండి 13

8 నుండి 13వ ప్రతివాదులకు నోటీసు

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది అయిన వేంపల్లి మోపూరు ఓబుళమ్మ చనిపోయినందున, ఆమె వారసులుగా మిమ్ములను చేర్చుటకు గాను పై నెంబరు దావాను వాదులు దాఖలు చేసినారు. అట్టి దావాలో మీ హాజరు కొరకు 18. 10.2024వ తేదీ వాయిదా వున్నది. పై దావాలో నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 18.10.2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు యందు ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని హాజరై తెలుపుకోవలసినది. లేనంతట నీ పరోక్షమున పై దావాను తీర్మానించబడును అని తెలియజేయడమైనది.

వాయిదా తేది:18.10.2024

//By the Order of the Court//

పి.రఘునాథరెడ్డి, ఎమ్.రామలింగేశ్వరరెడ్డి
వై.రామాంజులరెడ్డి
అడ్వకేట్స్, ప్రొద్దుటూరు.